# ధాం... ధాం... ధాం...

## ఎం.హరికిషన్

ఒకూర్లో ఒక అమాయకుడున్నాడు. అమాయకుడంటే ఏమీ తెలీనోడు అన్నమాట. ఒకరోజు వాళ్ళమ్మ వాన్ని పిలిచి 'రేయ్.. సంతకుపోయి ఒక మాంచి గుర్రాన్ని కొనుక్కోనిరాపో' అని డబ్బులిచ్చి పంపిచ్చింది. వాడు అలాగేనంటూ సంతకుపోయి బేరమాడకుండానే ఒక గుర్రాన్ని కొనుక్కోని ఇంటికి బైలుదేరినాడు.

వాడు గుర్రాన్ని తాడు పట్టుకోని తోలుకోని పోతావుంటే ఎదురుగా ఒకడు గుర్రంమీద వస్తా కనబడ్డాడు. అది చూసి వానికి కూడా గుర్రాన్ని ఎక్కాలనిపించింది. కానీ ఎట్లా ఎక్కాల్నో అర్థం కాలేదు. దాంతో వెనుక వైపు నుండి తోక పట్టుకోని పైకి ఎక్కినాడు. ఎక్కినాడుగానీ దాన్ని ఎట్లా తోలాల్నో అర్థంగాక 'ధాయ్..ధాయ్' అంటూ గట్టిగా ఒక్కటేసినాడు. అంతే దానికి కోపమొచ్చి ఎగిరి వాన్ని కిందపడేసింది. వాడు 'అమ్మా...అబ్బా' అని మూలుగుతూ పైకిలేచి 'మంచి గుర్రమియ్యమంటే కింద పడేసే గుర్రమిచ్చినాడే' దాన్ని ఎట్లా వదిలించుకోవాలబ్బా' అని ఆలోచిస్తా... ఆలోచిస్తా... పోతావుంటే దారిలో ఒకడు పొట్టేలు తీసుకోని వస్తా కనబన్నాడు. వెంటనే వీడు వాని దగ్గరకి పోయి 'అనా...అనా...నా గుర్రాన్ని తీస్కోని నీ పొట్టేలు ఇస్తావా 'అని అడిగినాడు.

పొట్టేలుకన్నా గుర్రం విలువైందిగదా.... దాంతోవాడు 'వీడెవడో తిక్కోనిలెక్కున్నాడే' అని నవ్వుకుంటా పొట్టేలునిచ్చి గుర్రాన్ని



సింగిల్ పేజీ కథ

తీసుకోనిపోయినాడు. వాడు పొట్టేలిని తీసుకోని పోతాపోతా వుంటే మధ్యలో 'ఈ పొట్టేలుకి కాళ్ళుచేతులు అన్నీ సక్కగా ఉన్నాయాలేదా' అని అనుమానమొచ్చింది. దాంతోవాడు కాళ్ళూ, చేతులూ, చెవులు అన్నీ చూస్తా.... ముందుకొచ్చి దాని కండ్లలోకి చూసినాడు. వాడట్లా చూస్తావుంటే భయపన్న పొట్టేలు నాలుగడుగులు వెనక్కేసి వేగంగా ముందుకొచ్చి తన తలతో వాని తలను ఎగిరి ధామ్మని ఒక డీచ్చీ కొట్టింది. అంతే... దెబ్బకు వానికి దిమ్మతిరిగి దభీమని పడిపోయినాడు.

'ఇదేందిరా నాయనా... మంచి పొట్టేలియ్యమంటే... తన్నే పొట్టేలు ఇచ్చినాడు. దీన్ని ఎట్లా వదిలించుకోవాలబ్బా' అని ఆలోచిస్తా పోతావుంటే ఎదురుగా ఒకడు సంకలో కోడిని పెట్టుకోని వస్తా కనబన్నాడు. వెంటనే వాడు ఉరుక్కుంటా వాని దగ్గరకుపోయి 'అనా...అనా...నా పొట్టేలు తీసుకోని నీ కోడిపెట్ట ఇస్తావా' అని అడిగినాడు.

కోడిపెట్ట కన్నా పొట్టేలు చానా విలువయినది గదా... దాంతో వాడు 'వీడెవడో తిక్కోని లెక్కున్నాడే' అని నవ్వుకుంటూ కోడిపెట్టనిచ్చి పొట్టేలుని తీసుకోని పోయినాడు.

వాడు కోడిపెట్టను తీసుకోని పోతావుంటే మధ్యలో చానా దప్పికయింది. ఒకచోట బావి కనబడితే కోడిపెట్టను పక్కన పెట్టి నీళ్ళు తోడుకోసాగాడు. కోడిపెట్టను అలా వదలడం ఆలస్యం అది ఇదే సందనుకోని ఉరకడం మొదలుపెట్టింది. వాడు అదిరిపడి దాని వెనుక పన్నాడు. అది వాన్ని ముల్ల కంచలల్లో, దిబ్బలల్లో వురికిచ్చీ...వురికిచ్చీ పెట్టింది. ఆఖరికి వాడు కిందామీదాపడి దాన్ని పట్టుకొన్నాడు. పట్టుకోని 'ఇదేందిరా నాయనా! మంచి కోడిపెట్ట కావాలనుకుంటే... వురికిచ్చే కోడిపెట్ట వచ్చింది. దీన్ని ఎట్లాగయినా వదిలిచ్చుకోవాలి' అనుకున్నాడు. వాడు పోతావుంటే దారిలో ఒకడు సంచిలో ఉల్లిగడ్డలు పట్టుకోని వస్తా కనబన్నాడు.

వెంటనే వాడు వురుక్కుంటా వాని దగ్గరికిపోయి 'అనా...అనా... నా కోడిపెట్ట తీసుకోని నీ ఉల్లిగడ్డలు ఇస్తావా' అని అడిగినాడు.

ఉల్లిగడ్డలకన్నా కోడిపెట్ట చానా విలువయినది గదా... దాంతో వాడు 'వీడెవడో తిక్కోని లెక్కున్నాడే' అని నవ్వుకుంటూ ఉల్లిగడ్డలనిచ్చి కోడిపెట్ట తీసుకోని పోయినాడు.

వాడు ఉల్లిగడ్డలు తీసుకొని పోతావుంటే మధ్యన 'ఈ ఉల్లిపాయలు బాగున్నాయా...లేదా' అని అనుమానమొచ్చింది. దాంతో వాడు ఒక ఉల్లిపాయ తీసుకొని కొరికినాడు. అంతే...దాని ఘాటుకు వాని కళ్ళ లోంచి గుర్రున నీళ్ళు కారినాయి. వాడదిరిపడి 'ఇదేందిరా నాయనా... మంచి ఉల్లిపాయలు కావాలనుకుంటే... ఏడిపిచ్చే ఉల్లిపాయలు ఒచ్చినాయి. ఎలాగయినా వీటిని వదిలిచ్చుకోవాలి' అనుకుంటూ పోతావుంటే దారిలో ఒకడు సంబరంగా బైటికి శబ్దం రాకుండా నోట్లోనే పాట పాడుకుంటూ చిటికెలేస్తా వస్తూ కనబన్నాడు. వానికి ఆ చిటికెల శబ్దం బాగా నచ్చింది. వెంటనే వాడు ఉరుక్కుంటూ వాని దగ్గరికి పోయి 'అనా...అనా.. నా ఉల్లిగడ్డలనిస్తా... అట్లా చిటికెలెట్లా వేయాల్నో నేర్పిస్తావా' అని అడిగినాడు.

దాంతోవాడు 'వీడెవడో తిక్కోని లెక్కున్నాడే' అని నవ్వుకొన్నాడు. ఉల్లిగడ్డలు తీసుకోని బొటనవేలు, మధ్యవేలు కలిపి చిటికలెట్లా వేయాల్నో నేర్పించి వెళ్ళిపోయినాడు.

వాడు సంబరంగా చిటికలేసుకుంటూ పోతావుంటే దారిలో ఒకచోట ఒక చెరువు కనబడింది. దప్పిక తీర్చుకుందామని చెరువులోకి దిగి దో సిళ్ళనిండా నీళ్ళు తీసుకోని కడుపునిండా తాగినాడు. తాగినాక మళ్ళీ మామూలుగానే చిటిక వేసినాడు. కానీ చేయి తడయింది గదా... దాంతో శబ్దం రాలేదు. వాడు అదిరిపడి "అరెరే... నా చిటిక నీళ్లలో జారిపడిపోయిందిరో నాయనో... ఎవరయినా వచ్చి దాన్ని తెచ్చియ్యండ్రో దేముడో" అని గుండెలు బాదుకుంటూ ఏడ్వసాగినాడు.

అది చూసి జనమంతా గుంపుగాచేరి 'ఏమయిందిరా' అనడిగితే వాడు 'ఏం చెప్పమంటారన్నా... నీళ్ళు తాగుతావుంటే వేళ్ళ మధ్య నుంచి జారిపోయింది. ఎక్కడపోయిందో ఏమో'. అన్నాడు ఏడుస్తా.

వేళ్ళ మధ్యనుంచి జారిపోయిందంటే బంగారు ఉంగరమేమో అనుకోని వాళ్ళంతా గబగబా నీళ్ళలోకి దిగి వెదకడం మొదలుపెట్టినారు. కాసేపటికి గాలి తగిలీ తగిలీ వాని చేతి తడమంతా ఆరిపోయింది. దాంతో మరలా చిటిక శబ్దం వచ్చింది. దాంతో వాడు 'ఏయ్...దొరికింది...దొరికింది' అని ఎగురుకుంటా చిటికెలు వేయసాగాడు.

అదిచూసి అందరూ 'అరెరే...అనవసరంగా ఈ తిక్కలోని మాటలు నమ్మి నీళ్ళలో దుంకినామే'. అని గొణుక్కుంటా పోయినారు.

వాడు సంబరంగా చిటికలేసుకుంటా—

గుర్రంపోయీ పొట్టేలొచ్చే ధాం...ధాం...ధాం...
పొట్టేలు పోయీ కోడీవచ్చే ధాం...ధాం...ధాం...
కోడీపోయీ ఉల్లిగడ్డొచ్చే ధాం...ధాం...ధాం...
ఉల్లిగడ్డపోయీ చిటికావచ్చే ధాం...ధాం...ధాం...

అని పాడుకుంటా ఇంటికి పోయినాడు. ఉత్త చేతులతో ఇంటికొచ్చిన కొడుకునిచూసి వాళ్ళమ్మ 'వీనికి డబ్బిచ్చి పంపడం నాదే బుద్ధి తక్కువ' అనుకోని మట్టసంగా నోరుమూసుకోనింది.